సాక్షి
జనగామ
ఆదివారం । 25 । జూన్ । 2023



అనుమతి.. అసమ్మతి - 8లో

రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క యూనియన్ నుంచి ఒక్కరికే అదీ వర్క్‌మెన్ క్యాడర్‌కే 'ఫుల్ టైమ్' అనుమతి ఇస్తామని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి.



ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్ల తుది రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. - 8లో

గరిష్టం/కనిష్టం
$31^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్త జనుల మధ్య అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామి వారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఏర్పాట్లను పరిశీలించారు. ఇల్లందు గ్రామానికి చెందిన గుగులోతు సుధాకర్–మమత దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. చిర్ర నాగరాజు, శ్యాంసుందర్, జంగిటి కుమార్, కుంచాల సంపత్‌రాజు, వేల్పుల గట్టయ్య, గొల్లపల్లి వాసు, పన్నీరు అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి

జనగామ రూరల్: విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం అధిక ఫీజులు వసూలు చేయకూడదు.. ఎలాంటి పుస్తకాలు, యూనిఫాం విక్రయించొద్దని.. అయితే వీటిని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అయినా డీఈఓ చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటి వరకు జిల్లాలో డీఎఫ్ఆర్‌సీ కమిటీ లేదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సందీప్, నాయకులు తరుణ్ వికాస్, విజయ్, మహేందర్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో కాంట్రాక్ట్ ఉద్యోగాలు

జనగామ రూరల్: జిల్లా పరిధి కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పలు ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి కె.రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 20 పీజీ సీఆర్‌టీలు, ఏడు సీఆర్‌టీలు, ఒక ఎస్ఓ, ఒక పీఈటీ పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఈనెల 26 నుంచి జూలై 5వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సర్కారు స్కూళ్ల సమస్యలు పరిష్కరించాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ముట్టడి



జనగామ రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం పాఠశాల విద్యార్థులతో కలిసి జనగామ ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వరంగల్ విభాగ్ కన్వీనర్ చింతకింది సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసి రాజకీయ పబ్బం గడుపుకుంటోందన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త పాఠశాల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పొన్నాల రమేష్, హృతిక్ సాయి, నరేష్, వంశీ, ఉమేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ చేప

రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ పెద్ద చెరువులో మత్స్యకారులు శనివారం చేపలు పట్టారు. ఒకరి వలలో 15 కేజీల బరువు కలిగిన గ్యాస్‌కట్ చేప పడింది. సాధారణంగా 2 నుంచి 5 కేజీల చేపలే వలలో చిక్కుతాయి. ఇంత పెద్ద చేప వలలో పడటం ఈ చెరువులో తొలిసారని ముదిరాజ్ కులస్తులు పేర్కొన్నారు. పెద్ద చేపను చూడటానికి గ్రామస్తులు ఆసక్తి కనబరిచారు.



గ్రూప్-4 పరీక్షకు సన్నద్ధం

- జిల్లాలో 29 సెంటర్లు
- ఐదు మండలాల్లో ఏర్పాట్లు
- పరీక్ష రాయనున్న 10,654 మంది అభ్యర్థులు
- జూలై ఒకటిన పరీక్ష
- ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లు

జనగామ: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్‌సీ) ఆధ్వర్యాన జూలై ఒకటిన నిర్వహించనున్న గ్రూప్–4 పరీక్ష ఏర్పాట్లలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. పేపర్ లీకేజీలతో పలు ఎంట్రెన్స్ పరీక్షలను రద్దు చేసిన టీఎస్‌పీఎస్‌సీ.. తిరిగి కొత్త నోటిఫికేషన్లతో మళ్లీ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధించి హాల్‌టికెట్లను ఈనెల 24న విడుదల చేసింది. మరో వైపు జిల్లా యంత్రాంగం సెంటర్ల వారీగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శనివారం జిల్లాలోని లైజనింగ్ ఆఫీసర్లతో పాటు రూట్ ఆఫీసర్లు(తహసీల్దార్లు) ఐదు మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన సెంటర్లను పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రొఫార్మాను పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు..

టీఎస్‌పీఎస్‌సీ ఎంట్రెన్స్ పేపర్ల లీకేజీ నేపథ్యంలో ఈసారి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగనున్నాయి. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తకుండా టెక్నికల్ డిపార్టుమెంటుకు బాధ్యతలను అప్పగించారు. ప్రశ్నా పత్రాలను భద్రపర్చడం.. తిరిగి సెంటర్లకు తరలించే క్రమంలో పోలీసు బందోబస్తు నిర్వహణపై ఆ శాఖకు రూట్ మ్యాప్ అందించనున్నారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయడంతోపాటు 300 మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.



జనగామ సాన్‌మారియా హైస్కూల్‌సెంటర్ వద్ద పరిశీలన అధికారి రోజారాణి

10,654 మంది అభ్యర్థులు.. 29 సెంటర్లు

గ్రూప్–4 పరీక్షకు జిల్లాలో 10,654 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఇందులో దివ్యాంగులు 231 మంది ఉన్నారు. జనగామటౌన్, బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, లింగాలఘణపురం, రఘునాథపల్లి మండలాల పరిధిలో 29 సెంటర్లు ఏర్పాటు చేశారు. సెంటర్‌కు ఒక చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు 435 మందికి పైగా ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పనిచేయనున్నారు.

పేపర్–1, 2

గ్రూప్–4 పరీక్షలో మొదటి పేపర్ జనరల్ స్టడీస్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాయాల్సి ఉంటుంది. పేపర్–2(సెక్రెటేరియల్ ఎబులిటీ/మ్యాస్ రిలేటెడ్) మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులను నిర్దేశిత సమయానికి గంట ముందు నుంచే సెంటర్‌లోకి అనుమతిస్తారు. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు గేట్లు మూసివేస్తారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించరు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతి గడియారాలు, కీచైన్లు తదితర వస్తువులను తీసుకురావొద్దు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలి. హాల్ టికెట్‌పై ఫొటో లేకుండా, ఇంకా ఏమైనా తప్పులు ఉంటే.. గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి తీసుకురావాలి. జిల్లా కేంద్రానికి దగ్గరలో.. ఆర్టీసీ బస్సు సర్వీసులతో పాటు ప్రైవేటు వాహనాల సేవలు అందుబాటులో ఉన్న మండలాలను పరీక్ష నిర్వహణకు ఎంపిక చేశారు.




ఆషాఢం 'గోరింటాకు'

వేసవి కాలం ముగిసి.. వానాకాలం ప్రారంభంలో వచ్చే ఆషాఢ మాసంలో అధిక వర్షాలు కురుస్తాయి. వాతావరణం చల్లబడినా.. మన ఒంట్లోని వేడి అలాగే ఉంటుంది. దీనికి తోడు సూక్ష్మక్రిములు పెరిగి అంటురోగాలు వ్యాప్తి చెందుతాయి. ఈ సమయంలో చేతికి గోరింటాకు పెట్టుకుంటే వేడిని తగ్గించి రోగ నిరోధక శక్తిని పెంచి రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. అందుకే ఆషాఢం వచ్చిందంటే మహిళలు గోరింటాకు పండుగ జరుపుకుంటారు. శనివారం జిల్లా కేంద్రం గీతానగర్‌లో కౌన్సిలర్ వంగాల కల్యాణి స్వగృహాన మహిళా సభ్యులు సహజ సిద్ధమైన గోరింటాకును సిద్ధం చేసుకుని చేతులకు అలంకరించుకున్నారు.

– జనగామ

మినీ ట్యాబ్‌ల పంపిణీ

జనగామ: ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన మినీ ట్యాబ్‌లను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ రాము శనివారం అందజేశారు. జిల్లాకు 318 ట్యాబ్‌లు అలాట్ కాగా.. ఆరు మండలాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు ఇచ్చారు. ఆదివారం మరో ఆరు మండలాలకు పంపిణీ చేస్తారు.



హెచ్ఎం లక్ష్మయ్యకు ట్యాబ్ అందిస్తున్న డీఈఓ

ఎంపీపీ జయశ్రీపై అవిశ్వాసానికి రంగం సిద్ధం..!

- మండల సర్వసభ్య సమావేశానికి తొమ్మిది మంది ఎంపీటీసీల గైర్హాజరు
- యాదాద్రికి చేరిన బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు.. అక్కడి నుంచే కార్యాచరణ?

లింగాలఘణపురం: మండల పరిషత్ అధ్యక్షురాలు చిట్ల జయశ్రీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన 9 మంది ఎంపీటీసీలు సిద్ధమయ్యారు. శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎవరూ హాజరు కాకుండా యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని అక్కడి నుంచే దైవ సాక్షిగా ప్రమాణం చేసి కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది. ఎంపీపీ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి కావడంతో అవిశ్వాసానికి సిద్ధమైనట్లు సమాచారం. మండలంలో 11 మంది ఎంపీటీసీలు ఉండగా ఏడుగురు బీఆర్ఎస్, నలుగురు కాంగ్రెస్‌కు చెందిన వారు. బీఆర్ఎస్ ఎంపీటీసీలు సిద్దు, మంగమ్మ, కృష్ణవేణి, గోలి రాజిరెడ్డి, సోమలక్ష్మి మద్దతుతో ఎంపీపీగా జయశ్రీ, వైస్‌ఎంపీపీగా కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. నాలుగేళ్ల పదవీ కాలం పూర్తికావడంతో కాంగ్రెస్ ఎంపీటీసీలు గుగ్గిళ్ల నర్సయ్య, కేమిడి భిక్షపతి, బర్ల మాధవి, మండపురం రజితతో కలిసి అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. దీనికి కడియం శ్రీహరి వర్గానికి చెందిన ఓ ఎంపీటీసీ కార్యాచరణ రూపొందించినట్లు విశ్వసనీయ సమాచారం. నలుగురు కాంగ్రెస్ ఎంపీటీసీల్లో ఒకరికి వైస్ ఎంపీపీ పదవి ఇవ్వాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ ఎంపీటీసీలతో కలిసి వెళ్లినట్లు తెలిసింది. యాదాద్రిలో ప్రమాణం చేసి ఒప్పందానికి వచ్చిన అనంతరం అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేయనున్నారు.



మండలంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎంపీటీసీలు

కారణాలు వెల్లడించిన ఎంపీటీసీలు

మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన తొమ్మిది మంది ఎంపీటీసీలు శనివారం సామూహికంగా ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో కారణాలను వెల్లడించారు. ఎంపీటీసీలుగా ఎంపికైనప్పటి నుంచి తమకు కనీస గౌరవం దక్కడంలేదని, నిధులు ఇవ్వడంలేదని, మండల అభివృద్ధిని మరిచి వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితమవుతూ ప్రజల కనీస అవసరాలు తీర్చడంలేదని పేర్కొన్నారు. గతంలో చేసిన తీర్మానాలను అమలు చేయడంలేదని నిరసిస్తూ సభను బహిష్కరిస్తున్నామని, తదుపరి కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రోజుకో కోణంలో విచారణ

- రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్య హత్య కేసు విచారణ ముమ్మరం

బచ్చన్నపేట: పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసు విషయంలో పోలీసులు రోజుకో కోణంలో విచారణ నిర్వహిస్తున్నారు. శనివారం మండల పరిధి పలు గ్రామాలకు చెందిన అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు రప్పించి సీఐ నాగబాబు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. రామకృష్ణయ్య హత్య అనంతరం గోపాల్‌నగర్‌లోని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి ఇంటి ముందు బాణాసంచా కాల్చి సంబురాలను జరుపుకున్న విషయమై రెండు రోజులుగా పలువురిని స్టేషన్‌కు రప్పించి విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల గ్రామంలో జరిగిన దుర్గామాత ఉత్సవాలకు సర్పంచ్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విందుకు పలువురు నాయకులు హాజరైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా రామకృష్ణయ్య హత్యకు ముందు జరిగిన ఒప్పందం గురించి చర్చించుకోగా.. ఈ సందర్భంగా పలువురిపై ఆరోపణలు రావడంతో వారిని కూడా పోలీస్‌స్టేషన్‌కు రప్పించి విచారిస్తున్నట్లు తెలిసింది. హత్యకేసులో ప్రధాన నిందితుడు గిరబోయిన అంజయ్యకు సంబంధించి గోపాల్‌నగర్ 174 సర్వే నంబర్‌లో భూమి ఉందని, అందులో కొంత భూమిని కలిగి ఉన్న వారిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా అంజయ్య మధ్యవర్తిత్వం చేసిన భూములకు సంబంధించి పలువురు హద్దులు తొలగించి సేద్యం చేసుకుంటున్నారు. పోచన్నపేట, జనగామ రోడ్డులో భూములు కోల్పోయిన వారు తిరిగి తీసుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

మహిళా సాధికారతకు కృషి



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: మహిళా ఆర్థిక సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. శనివారం సింగరాజుపల్లి తుమ్మ గార్డెన్‌లో మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ రెండోవిడత కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు మొదటి విడత శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సాధన కర్త సీఎం కేసీఆర్.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, ఈ క్రమంలోనే కుటుంబం, సమాజం అభివృద్ధికి మహిళల అభ్యున్నతే ఏకైక మార్గమని భావించి కీలక పథకాలను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో తొలివిడత పాలకుర్తి నియోజకవర్గంలో పదివేల మందికి ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్లు పంపిణీ చేయడమే కాకుండా ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఐకేపీ, స్త్రీనిధి ద్వారా వచ్చే రుణాలతో స్వయం సమృద్ధి సాధించేందుకు ఇలాంటి ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ధరావత్ తండాలో మృతిచెందిన మాజీ సర్పంచ్ హనుమాన్‌నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ సావిత్రి, వైస్‌ఎంపీపీ విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు గోపాల్‌దాస్, మల్లేష్, రమాదేవి, సునీత, బండి స్నేహ, శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, సీసీలు వసంత, ఉమ, సోమనారాయణ, రామచంద్ర, నల్ల ఉమ, సంధ్య, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ పీఈసెట్‌లో దేవాకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన గుర్రం దేవా తెలంగాణ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రం ప్రమీల, ముత్తయ్య దంపతుల కుమారుడు దేవా శివునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు, ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. నిరుపేదలైన తల్లిదండ్రులు కూలి పనులు చేసి కుమారుడిని చదివించారు. కాగా మొదటి నుంచి స్పోర్ట్స్‌పై ఆసక్తి ఉన్న దేవా హ్యాండ్‌బాల్ క్రీడలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పలు మెడల్స్ సాధించాడు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే..

పాఠశాల విద్య నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పీఈటీలు, కోచ్‌ల ప్రోత్సాహంతోనే హ్యాండ్‌బాల్ క్రీడలో రాణించానని ఈ సందర్భంగా దేవా అన్నారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇండియన్ నేవీ, ఆర్మీ, రైల్వేలో ఉద్యోగం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.



తల్లిదండ్రులతో ర్యాంకర్ గుర్రం దేవా

28న విదేశీ ఉద్యోగాలపై ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

- ఆసక్తి, అర్హత ఉన్నవారు సమగ్ర సమాచారంతో హాజరుకావాలి
- జిల్లా ఉపాధికల్పన అధికారి ఉమారాణి

జనగామ: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ(టామ్కామ్) సంస్థ ఆధ్వర్యాన జిల్లా ఉపాధి శాఖ కార్యాలయంలో ఈనెల 28న విదేశీ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న అభ్యర్థుల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సీహెచ్.ఉమారాణి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ రంగాల్లో వృత్తి నైపుణ్యం కలిగి.. విదేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు ఉత్సాహంగా ఉన్న అభ్యర్థుల కోసం ప్రభుత్వం కార్మిక శిక్షణ, ఉపాధి కర్మాగారాల శాఖ పర్యవేక్షణలో టామ్కామ్ అనే రిజిస్టర్డ్ విదేశీ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీని ఏర్పాటు చేసిందన్నారు. గల్ఫ్ దేశాలతో పాటు, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, హంగేరి, పోలాండ్, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, రొమేనియా దేశాల్లో ఉద్యోగాల భర్తీకి ఒప్పందం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేసి పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలో మైనింగ్ విభాగం, ప్లాంట్ మెకానిక్, మెకానికల్ ఫిట్టర్, మెకానికల్ ఇంజినీర్, కన్వేయర్ బెల్ట్ టెక్నీషియన్, ఇతర పరిశ్రమల్లోని మిషనిస్ట్, వెల్డర్, బాయిలర్ మేకర్, ఫ్యాబ్రికేటర్ ఉద్యోగాలు, జర్మనీలో మీట్ ప్రాసెసింగ్, ఫుడ్ రీటెయిల్ సేల్స్, భవన నిర్మాణాలు, క్లర్కు, ట్రక్ డ్రైవర్, ఆపరేటర్ ఖాళీలనుబట్టి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న 22 నుంచి 28 ఏళ్ల వయసు యువత సమగ్ర సమాచారంతో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7997973327 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఈవీఎంల తనిఖీ షురూ..



అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్



మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

- పది రోజుల పాటు పరిశీలన
- ప్రారంభించిన జిల్లా ఉపఎన్నికల అధికారి

జనగామ: రాష్ట్రంలో త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాంలో ఈవీఎంల మొదటి దశ పరిశీలన కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఉప ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ప్రారంభించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పాత ఈవీఎంలను ఎలక్షన్ కమిషన్‌కు పంపించగా.. తిరిగి వాటి స్థానంలో కొత్తవి వచ్చాయి. మొత్తం 857 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 1,430–కంట్రోల్ యూనిట్లు (సీయూ), 1,845–బ్యాలెట్ యూనిట్లు(బీయూ), 1,406–వీవీ ప్యాడ్‌లు జిల్లాకు చేరాయి. వాటిని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈసీఐఎల్ కంపెనీకి చెందిన ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది ఫస్ట్ లెవల్ తనిఖీలు చేపట్టారు. ఒక్కో యంత్రాంలో డమ్మీ గుర్తులను ఏర్పాటు చేసి 96 ఓట్లతో ఓటింగ్ నిర్వహించి కరెక్టుగా ఉన్నాయా లేదా అని నిర్ధారణ చేసుకుంటున్నారు. యంత్రాల్లో సాంకేతిక సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వాటిని రిజర్వులో ఉంచుతామని అధికారులు వెల్లడించారు. పది రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని ప్రఫుల్ దేశాయ్ పేర్కొన్నారు. కాగా గోదాం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంత్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుమోహన్, కలెక్టరేట్ ఏఓ మన్సూరి, తహసీల్దార్ రవీందర్, రాజకీయ పార్టీల నాయకులు గౌరబోయిన సమ్మయ్య, రావెల రవి, వెంకట్‌రెడ్డి, బొట్ల శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టయ్య

జనగామ: ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలా గట్టయ్య డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లపై ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మతో ఊరేగించారు. చౌరస్తాలో ధర్నా చేసి దిష్టిబొమ్మను దహనం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా గట్టయ్య మాట్లాడుతూ ముదిరాజ్‌లకు కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పని పక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌యాదవ్‌కు కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్‌లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.



కౌశిక్‌రెడ్డిపై సీఐకి ఫిర్యాదు చేస్తున్న ముదిరాజ్‌లు

బమ్మెరలో నేడు రైతు సదస్సు

పాలకుర్తి: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు భూమికి సంబంధించి చట్టపరమైన నిబంధనలను వివరించేందుకు మండల పరిధి బమ్మెరలో ఆదివారం సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా లీగల్ అఫీషియల్ శర్మ తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావుతోపాటు రాష్ట్ర న్యాయ సేవా సంస్థ సభ్యుడు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, రైతు చట్టాలు, విధానాల డైరెక్టర్ ఎం.సునీల్, ప్రొఫెసర్ కృష్ణదేవరావు, డి.రవీంద్ర శర్మ, సి.విక్రమ్ హాజరవుతున్నట్లు వివరించారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహక బృందం శనివారం పరిశీలించింది.

దేవాదాయ భూములు ఆక్రమిస్తే చర్యలు

- నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తాం
- శ్రీ చెన్నకేశ్వర ఆలయ ఈఓ శేషభారతి

జనగామ: దేవాలయ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు.. అందులో నిర్మాణాలు చేపట్టినా కూల్చి వేసి కేసులు నమోదు చేస్తామని జనగామ శ్రీ చెన్నకేశ్వర ఆలయ ఈఓ శేషభారతి హెచ్చరించారు. సమీకృత కలెక్టరేట్ ఎదురుగా 78 సర్వే నంబర్‌లో స్వామివారి పేరిట ఉన్న 39 గుంటల భూమిని శనివారం ఆమె పరిశీలించారు. ఆ స్థలంలో నిర్మాణం కోసం సిమెంటు ఇటుకలు, ఇసుక పోసి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం శేషభారతి మాట్లాడుతూ ఈ దేవుడి భూమిపై ఎండోమెంటు డిపార్టుమెంటుకే హక్కు ఉంటుందని, ప్రైవేటు వ్యక్తులకు లేదన్నారు. ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, అవసరమైతే దుకాణాలు, ఆస్పత్రులు తదితరాలకు 39 గుంటల భూమిని లీజుకు ఇస్తామని పేర్కొన్నారు. ఇందులో నిర్మాణాలు చేసుకున్న వారు 70శాతం అద్దె తీసుకుని 30 శాతం ఎండోమెంటు డిపార్టుమెంటుకు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇందుకు సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. జిల్లాలోని ఆలయ భూముల పరిరక్షణకు దేవాదాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



దేవాదాయ భూమిని పరిశీలిస్తున్న శేషభారతి

ముగిసిన పోలీస్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

వరంగల్ క్రైం: సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్ల తుది రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. ఈనెల 14 నుంచి మొదలైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో 7706 మందికి అవకాశం రాగా 6663 మందివి పరిశీలించారు. దీనికి గాను 20 కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తు సమయంలో తప్పులు దొర్లితే వాటిని సరిదిద్దుకునేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, పరిపాలన విభాగానికి చెందిన ఏవో, సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ వాయిదా

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఈనెల 26(సోమవారం)వ తేదీన జరగాల్సిన పోలీస్ గ్రీవెన్స్ అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు వరంగల్ పోలీస్ మిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం గ్రీవెన్స్ ఉంటుందని, ప్రజలు వినతులు అందించొచ్చని సీపీ తెలిపారు.

'అనుమతి'..అసమ్మతి

విద్యుత్ శాఖలో వర్క్‌మెన్ కేడర్‌కే 'ఫుల్‌టైమ్ అనుమతి'

- రాష్ట్ర ప్రధాన పోస్టులలో ఇతర కేటగిరీ ఉద్యోగులు
- యూనియన్‌కు రాష్ట్రంలో ఒక్కరికే అవకాశం
- గతంలో విద్యుత్ సంస్థల వారీగా యూనియన్‌కు ఒక్కరు..
- ఈ క్యాలెండర్ సంవత్సరంలో నిబంధనల్లో మార్పు
- ఎవరికి ఇవ్వాలో తేల్చుకోలేకపోతున్న యూనియన్‌లు

విద్యుత్ శాఖలో ఓ యూనియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి.. ఆ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం, సమావేశాలకు హాజరు కావడం, ఇతరత్రా యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు విధులకు హాజరు కాకుండా పూర్తి స్థాయిలో మినహాయింపు ఇస్తారు. దీనిని 'ఫుల్‌టైమ్ అనుమతి' అంటారు. ఇటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ.. అటు యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలు కాదని భావించి విద్యుత్ సంస్థలు 'ఫుల్‌టైమ్ అనుమతి' ఇస్తాయి. అయితే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క యూనియన్ నుంచి ఒక్కరికే అదీ వర్క్‌మెన్ క్యాడర్‌కే 'ఫుల్‌టైమ్' అనుమతి ఇస్తామని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిర్ణయంతో యూనియన్, వెల్ఫేర్ అసోసియేషన్ నేతల్లో అసమ్మతి నెలకొంది. -హన్మకొండ



ఒక్కో యూనియన్ నుంచి రాష్ట్రంలో ఒక్కరికే 'ఫుల్‌టైమ్'

రాష్ట్రంలో టీఎస్ జెన్‌కో, టీఎస్ ట్రాన్స్‌కో, టీఎస్ దక్షిణ విద్యుత్ పంపిణీ మండలి, టీఎస్ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి ఉన్నాయి. గతంలో ఈ నాలుగు విద్యుత్ సంస్థల నుంచి యూనియన్‌కు ఒక్కరు చొప్పున 'ఫుల్‌టైమ్' అనుమతి తీసుకునే వారు. ప్రస్తుతం 2023 క్యాలెండర్ సంవత్సరంలో ఒక్కో యూనియన్ నుంచి రాష్ట్రంలో ఒక్కరికి మాత్రమే ఫుల్‌టైమ్ ఇవ్వాలని 2022 డిసెంబర్16న జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ కంపెనీస్ కో ఆర్డినేషన్ మీటింగ్‌లో నాలుగు విద్యుత్ యాజమాన్య సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. నాలుగు కంపెనీల్లో ఏదైని కంపెనీ నుంచైనా యూనియన్‌కు ఒక్కరు మాత్రమే 'ఫుల్‌టైమ్' అనుమతి తీసుకోవాలి.

'ఫుల్‌టైమ్' అంశం పక్కకు..

2023 క్యాంలెండర్ సంవత్సరం సగం పూర్తయినా యూనియన్‌లు ఇప్పటికీ నిర్ధారణకు రాలేకపోయాయి. ఒక్క యూనియన్, రెండు అసోసియేషన్లు మినహా మిగతా సంఘాలు ఎటుతేల్చుకోలేక 'ఫుల్‌టైమ్' అంశాన్ని పక్కకు పెట్టినట్లు చర్చించుకుంటున్నారు.

వర్క్‌మెన్ క్యాడర్‌కే 'ఫుల్‌టైమ్'..

ఇదిలా ఉండగా వర్క్‌మెన్ క్యాడర్‌కే 'ఫుల్‌టైమ్' ఇవ్వాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయించాయి. వర్క్‌మెన్ క్యాడర్ అంటే కింది స్థాయి ఉద్యోగులు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో జేఎల్‌ఎం నుంచి.. ఫోర్‌మెన్ వరకు.. ప్రోవెన్షియల్ (మినిస్టీరియల్) స్టాఫ్‌లో అటెండర్ స్థాయి నుంచి.. సీనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు వస్తారు. ఆ తరువాత స్థాయి వారు వర్క్‌మెన్ క్యాడర్ పరిధిలోకి రారు. అయితే పలు యూనియన్‌లకు వర్క్‌మెన్ క్యాడర్ పైస్థాయి ఉద్యోగంలో కొనసాగుతున్న జూనియర్ అకౌంట్స్ అఫీసర్‌లు రాష్ట్ర స్థాయి కీలక పదవుల్లో కొనసాగుతున్నారు. వీరు ఇప్పటి వరకు 'ఫుల్‌టైమ్' అనుమతితో యూనియన్ కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. ఇటీవలి నిర్ణయంతో వీరికి 'ఫుల్‌టైమ్' అవకాశం చేజారింది. ఉదాహరణకు టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో హనుమకొండ సర్కిల్‌లో పని చేస్తున్న రెండు ప్రధాన యూనియన్‌లలో ఒక యూనియన్‌కు ఒక్కరు రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా, మరో యూనియన్‌కు ఒక్కరు రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వీరు ఇరువురు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌లుగా ఉద్యోగం చేస్తున్నారు. అయితే జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ క్యాడర్ గెజిటెడ్ ఆఫీసర్ స్థాయి కిందకు రాదు. దీంతో తాము వర్క్‌మెన్ క్యాడర్ పరిధిలోకి వస్తామని జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌ల వాదన. వర్క్‌మెన్ క్యాడర్ దాటి ఆఫీసర్ క్యాడర్‌లోకి వెళ్లినందున వీరికి వర్క్‌మెన్ క్యాడర్ వర్తించదని యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి.

తేల్చులేకపోతున్న యూనియన్లు

అయితే ఇప్పటి వరకు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ జెన్‌కోలో ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న మాతంగి శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌లో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ముత్యం వెంకన్న, టీఎస్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ జెన్‌కో నుంచి రామకృష్ణ మాత్రమే 'ఫుల్‌టైమ్' అనుమతి పొందారు. మిగతా యూనియన్‌లు, అసోసియేషన్లు 'ఫుల్‌టైమ్' అనుమతిపై ఎటు తేల్చులేక పోతున్నాయి.

ఒక్కరికి మాత్రమే 'ఫుల్‌టైమ్'..

గతంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104, టీఎస్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-327, టీఆర్‌వీకేఎస్, టీఎస్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ జెన్‌కో), టీఎస్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్, స్టేట్ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఓసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల నుంచి నాలుగు విద్యుత్ సంస్థల నుంచి నలుగురికి, రాష్ట్ర స్థాయిలో ఒక్కరికి చొప్పున ఒక్కో యూనియన్‌కు మొత్తం ఐదుగురు ఉద్యోగులు 'ఫుల్‌టైమ్' తీసుకునే వారు. ఈ లెక్కన నాలుగు యూనియన్‌లు, ఐదు వెల్ఫేర్ అసోసియేషన్‌ల నుంచి మొత్తం 45 మంది ఉద్యోగులు 'ఫుల్‌టైమ్' తీసుకునేవారు. వీరి సంఖ్య కుదించడంతో పాటు ఉద్యోగులు విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా యూనియన్, అసోసియేషన్ నుంచి రాష్ట్రానికి ఒక్కరికి మాత్రమే 'ఫుల్‌టైమ్' ఇవ్వాలని సంస్థల యాజమాన్యాలు నిర్ణయించాయి.

రైళ్ల రద్దు కొనసాగింపు

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ మీదుగా నడిచే పలు రైళ్ల రద్దును మరో ఏడు రోజులు పొడిగించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లలో ఇన్‌ఫ్రాస్ట్రక్చువల్ మరమ్మతుల కోసం డోర్నకల్ స్టేషన్ మీదుగా నడిచే భద్రాచలం రోడ్-విజయవాడ, విజయవాడ-భద్రాచలం రోడ్, కాజీపేట- విజయవాడ, విజయవాడ-కాజీపేట, భద్రాచలం రోడ్-బలార్షా, సిర్పూర్-భద్రాచలం రోడ్ రైళ్లను ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు రద్దు చేశారు. ప్రస్తుతం రోలింగ్ కారిడార్ ప్రోగ్రాం పని నిమిత్తం మరోసారి ఈ రైళ్లను ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

21న మిస్సింగ్.. 22న విశాఖలో ప్రత్యక్షం

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యంలో కొత్తకోణం



నూనావత్ వినయ్‌కుమార్

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం రాములుతండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నూనావత్ వినయ్‌కుమార్ అదృశ్యం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ నెల 21న (బుధవారం) రాత్రి కోల్‌కతా నుంచి విజయవాడ వరకు రైలులో వస్తూ అదృశ్యమైన విషయం తెలిసిందే. కాగా, పోలీసులు ఇతను 22న విశాఖపట్నంలోని ఓ బాయ్స్ హాస్టల్‌లో ఉన్నట్లు సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. మిస్సింగ్ అయిన వ్యక్తి మరుసటి రోజు విశాఖపట్నంలో ఎలా తేలాడన్నది అంతుపట్టడం లేదు. వినయ్‌కుమార్ అదృశ్యంపై గత గురువారం విజయవాడకు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు వారు విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి 10.26 నిమిషాలకు వినయ్‌కుమార్ తన తండ్రి సదాశివుడితో ఫోన్‌లో మాట్లాడిన టైం ఆధారంగా గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు కటక్..బోజ్‌పూర్ రైల్వే మార్గంలో పోలీసులు ట్రాక్ వెంట తనిఖీ చేపట్టినా ఎలాంటి ఆధారం కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

పది రోజులు హాస్టల్‌లోనే ఉన్నాడు..

బుధవారం రాత్రి కటక్..బోజ్‌పూర్ రైల్వే మార్గంలో రాత్రి వినయ్‌కుమార్ అదృశ్యమైనట్లు భావిస్తున్న పోలీసులకు అతని సెల్‌ఫోన్ కాల్ డాటా ఆధారంగా ఆరా తీశారు. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలోని 7 హిల్స్ అనే ఓ బాయ్స్ హాస్టల్ పరిధిలో వినయ్‌కుమార్ సెల్‌నంబర్ పనిచేసినట్లు గుర్తించారు. వెంటనే అక్కడినుంచి శనివారం ఉదయం రైల్వే పోలీసులతో విశాఖపట్నంలోని ఆ హాస్టల్ చేరుకున్న కుటుంబ సభ్యులు.. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఇరువురు కలిసి 7 హిల్స్ హాస్టల్ యజమాని, సిబ్బందితో వినయ్‌కుమార్‌పై ఆరా తీశారు. వారు ఆ పేరు గల వ్యక్తి పది రోజులుగా ఉన్నది నిజమేనని, రెండు రోజుల క్రితం బయటకు వెళ్లాడని, తిరిగి 22వ తేదీన వచ్చి మళ్లీ బ్యాగ్ తీసుకొని వెళ్లాడని చెప్పారు. అతను బయటికి వెళ్తున్నట్లు సీసీ కెమెరా ఫుటేజీలో గుర్తించారు. రైలులో వస్తూ పడిపోయాడనుకున్న వ్యక్తి, తెల్లవారే విశాఖపట్నం ఎలా వచ్చాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. పది రోజులుగా హాస్టల్‌లో ఉన్నవాడు కోల్‌కతా నుంచి విజయవాడకు వస్తున్నట్లు తల్లిదండ్రులను ఎందుకు నమ్మించాడు.. అసలు సెల్‌ఫోన్ ఎందుకు స్విచ్చాఫ్ చేశాడు.. ఈ అదృశ్యం వెనకాల దాగి ఉన్న మిస్టరీ అంతుచిక్కడం లేదు. ఇదిలా ఉండగా ఐదు నెలల క్రితం ప్రేమించి పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న వినయ్‌కుమార్ ఏమైనా డిప్రెషన్‌లోకి వెళ్లాడా.. అసలు బతికే ఉన్నాడా, లేక ఎవరైనా కిడ్నాప్ చేశారా అన్నది మండలంలో చర్చనీయాంశంగా మారింది.

28న వరంగల్ డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ : వరంగల్ డీసీసీబీ మహాజన సభ ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి చింతలపూడి చిన్నారావు శనివారం తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన హనుమకొండ నక్కలగుట్టలోని పాపడమ్స్ బ్లూ కాన్ఫరెన్స్ హాల్‌లో మహాజన సభ జరుగుతుందన్నారు. 28న ఉదయం 11 గంటలకు జరిగే ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పీఏసీఎస్ చైర్మన్‌లు, డీసీసీబీలో సభ్యత్వం కలిగిన ఆయా సహకార సంఘాల చైర్మన్లు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఆత్మకూరు: ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఓ హెడ్‌కానిస్టేబుల్.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన కొర్ర భీమ్‌సింగ్(54) జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. భీమ్‌సింగ్ కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. రూ.25 లక్షలు అప్పు చేయగా రూ. 6 లక్షల వరకు తిరిగి చెల్లించాడు. మిగిలిన అప్పు ఎలా తీర్చాలనే బెంగతో గురువారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు నగరంలోని ఓ ఆస్పత్రికి చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య వసంత శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమార్ తెలిపారు.

సీజీఆర్‌ఎఫ్ వరంగల్ చైర్మన్‌గా వేణుగోపాలచారి



వేణుగోపాలచారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరంగల్ ఎస్ఈ మధుసూదన్, డీఈ (టీ)ఆనందం

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) వరంగల్ చైర్మన్‌గా వేణుగోపాలచారి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్‌గా కొనసాగిన పెరుమాండ్ల సత్యనారాయణ పదవీకాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో టీఎస్ఈఆర్‌సీ వేణుగోపాలచారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని సీజీఆర్‌ఎఫ్ కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వేణుగోపాలచారిని ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ఐఎంఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం



ఉస్మాన్



ఇస్మాయిల్

న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మైనార్టీ గురుకులాల రికార్డులు, స్టాక్ మేనేజ్‌మెంట్ తదితర రికార్డుల తనిఖీ కోసం ఇన్వెంటరీ మాడ్యూల్ సిస్టమ్(ఐఎంఎస్) ఇన్‌చార్జ్‌లుగా హనుమకొండ(బీ1), మహబూబాబాద్(బీ1) గురుకులాల డిప్యూటీ వార్డెన్‌లు మహ్మద్ ఉస్మాన్, మహ్మద్ ఇస్మాయిల్‌ను నియమిస్తూ సెక్రటరీ షఫీయుల్లా ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 16 గురుకుల పాఠశాలలు, కళాశాలల డిప్యూటీ వార్డెన్‌లకు రికార్డ్ మెయింటనెన్స్, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డ్ అంశాలపై శిక్షణ ఇస్తారు. ఐఎంఎస్‌లుగా నియామకమైన ఇద్దరిని ప్రిన్సిపాళ్లు, డిప్యూటీ వార్డెన్‌లు అభినందించారు.

శరీరదాన అంగీకారపత్రాల అందజేత



అంగీకార పత్రాలు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఎంజీఎం : గొప్ప సంకల్పంతో తమ మరణానంతరం శరీరదానం చేస్తామని అంగీకరించిన పలువురు.. ఆ పత్రాలను శనివారం శరీర అవయవదాతల అసోసియేషన్ ప్రతినిధి, కేఎంసీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ పద్మజకు అందించారు. ఈ సందర్భంగా శరీర అవయవదాతల అసోసియేషన్ ప్రతినిధి మల్లారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా చనిపోతే వారి మృతదేహాలను మెడికల్ కాలేజీకి అప్పగించాలన్నారు. తద్వారా విద్యార్థులు వైద్య విద్య నేర్చుకుంటారని తెలిపారు. అనంతరం శరీర దానం చేస్తామని అంగీకారం పత్రం అందజేసిన 40 మందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ రావు యాదవ్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, కేదారి పాల్గొన్నారు.

ఈ-నామ్ సదస్సులో మార్కెట్ అధికారులు..

వరంగల్: గోవాలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగిన ఈ-నామ్ జాతీయ సదస్సులో వరంగల్ డీడీఎం రాజునాయక్, వరంగల్ మార్కెట్ కమిటీ కార్యదర్శి బీవీ రాహుల్‌లో పాల్గొన్నారు. మూడు రోజులు జరిగిన ఈసదస్సులో ఈ-నామ్ అమలుపై ఎదురవుతున్న ఇబ్బందులను మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి.. జాతీయ స్థాయి అధికారులకు వివరించినట్లు డీడీఎం రాజునాయక్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరంగల్, ఖమ్మం జిల్లాలో మిర్చి కొనుగోళ్లలో ఈ-నామ్ అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. సదస్సులో తెలంగాణ నుంచి రాష్ట్ర సహాయ సంచాలకుడు లక్ష్మణుడు పాల్గొన్నట్లు తెలిపారు.

స్కూల్ బస్సులపై రవాణాశాఖ దాడులు

- జిల్లా వ్యాప్తంగా తనిఖీలు
- నిబంధనలు పాటించని బస్సులపై కేసు
- గీతాంజలి స్కూల్ బస్సులపై చర్యలు
- వివరాలు వెల్లడించిన ఎంవీఐ రవీందర్



వివరాలు వెల్లడిస్తున్న ఎంవీఐ రవీందర్

ఖిలా వరంగల్ : ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. వరంగల్ జిల్లా ఆర్టీఏ ఆఫ్రీన్ సిద్దిఖీ ఆదేశాల మేరకు శనివారం ఉదయం వరంగల్ రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రహదారులపై కళాశాల, స్కూల్ బస్సులను ఆపి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించారు. అలాగే బస్సుల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను అదుపు చేసే అగ్నిమాపక యంత్రాల సిలిండర్ అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించారు. నర్సంపేటలో గీతాంజలి డీజీ స్కూల్ బస్సు వెనుక అద్దం లేకపోవడంతో అధికారులు గుర్తించి చర్యలు తీసుకున్నారు. బస్సుకు మిర్రర్ బిగించిన తర్వాత విద్యార్థులను తరలింపునకు అనుమతించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రవీందర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులను నడపాలన్నారు. ఫిట్‌నెస్ ఉన్న స్కూల్ బస్సుల్లో విద్యార్థులను తరలించాలని, లేనిపక్షంలో బస్సులను సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. అదేవిధంగా ఈనెల 30 వరకు విస్తృతంగా దాడులు నిర్వహించి నిబంధనలు పాటించని వాటిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవీఐ వెంకన్న, ఏఎంవీఐ శాలిని, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌కు అడ్డు వచ్చిన వానరం..

- కిందపడిన దంపతులు
- కోమాలోకి భార్య.. పరిస్థితి విషమం
- కొత్తపోచారంలో ఘటన



చికిత్స పొందుతున్న రూతమ్మ

గార్ల : దంపతులు బైక్‌పై వెళ్తుండగా మర్గమధ్యలో వానరం అడ్డువచ్చింది. దీంతో సడన్ బ్రేక్ వేయగా.. భార్య బైక్ నుంచి పడి తీవ్రగాయాలపాలై కోమాలోకి వెళ్లి ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతోంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గార్ల మండలం కొత్తపోచారం గ్రామానికి చెందిన 4వ వార్డు సభ్యురాలు తిప్పారపు రూతమ్మ భర్త హనుమంతరావుతో కలిసి బైక్‌పై శుక్రవారం గార్లకు వచ్చారు. అనంతరం స్వగ్రామం వెళ్తుండగా గోపాలపురం సమీపంలో బైక్‌కు కోతి అడ్డొచ్చింది. దీంతో హనుమంతరావు సడన్ బ్రేక్ వేయగా వెనుక కూర్చున్న రూతమ్మ రోడ్డుపై పడింది. తల వెనుక భాగంలో తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే కోమాలోకి వెళ్లింది. క్షతగాత్రురాలిని హుటాహుటిన 108 ద్వారా ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కాగా, తమది నిరుపేద కుటుంబమని, కనీసం వైద్య ఖర్చులకు కూడా డబ్బు లేదని, దాతలు స్పందించి తన భార్యకు ప్రాణభిక్ష పెట్టాలని హనుమంతరావు వేడుకుంటున్నాడు. దాతలు 9573073641 నంబర్‌కు ఫోన్ పే చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు 'ఓ' సిటీ ప్లాట్లకు వేలం

కరీమాబాద్: వరంగల్ 'ఓ' సిటీలోని 'కుడా'కు చెందిన ప్లాట్లకు ఆదివారం వేలం నిర్వహిస్తున్నట్లు 'కుడా' వైస్ చైర్మన్ రిజ్వాన్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్-నర్సంపేట రోడ్డులో ఉన్న 36 నివాసయోగ్య, 6 వాణిజ్యపర ప్లాట్లను వేలంలో విక్రయిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈఎండీ ద్వారా రూ. 25 వేలు, రూ. 50 వేల చొప్పున చెల్లించి టోకెన్ పొంది వేలంలో పాల్గొనాలన్నారు.